క్లుప్తంగా

28వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో రూ.69.80 లక్షల నిధులతో తలపెట్టిన రోడ్లు, డ్రైనేజీ, తదితర అభివృద్ధి పనులను జీవీఎంసీ అధికారులు ప్రారంభించారు. ఈ పనులను మంగళవారం వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పరిశీలించారు. పనులను వేగంగా నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి కోన కామేశ్వరరావు, మూర్తి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో వంగవీటి విగ్రహం ఏర్పాటు చేయాలి

బీచ్ రోడ్డు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన వంగవీటి రంగా విగ్రహాన్ని సాగర తీరంలో ఏర్పాటు చేయాలని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ. పాల్ కోరారు. ఈ మేరకు మంగళవారం సాగర తీరంలో విగ్రహం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. పరిపాలన రాజధానిగా విశాఖను ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రంగా విగ్రహాన్ని ముందుగానే ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయని పక్షంలో తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

గురుద్వార్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలా

సీతమ్మధార : కేంద్ర మత్స్య, పశువర్ధకశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా గురుద్వార్ సత్‌సంగత్‌ను సందర్శించారు. వీర్ బాల్ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. చివరి సిక్కు గురువైన గురు గోవింద్ సింగ్ జీ నలుగురు కుమారుల ధైర్యసాహసాలకు నివాళులు అర్పించేందుకు డిసెంబర్ 26న వీర్ బల్ దివాస్ జరుపుకుంటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోవింద్ సింగ్ జీ నలుగురు కుమారుల ధైర్యసాహసాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహరావు, గురుద్వార్ సత్‌సంగత్ అధ్యక్షుడు డా.డీఎస్.ఆనంద్, నగర బీజేపీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'సాహిత్యం సామాజిక ప్రయోజనం'పై స్మారకోపన్యాసం



గణపతిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కూటికుప్పల, జీఎస్ఎన్ రాజు

సీతంపేట: విశ్వ సాహిత్య లలిత కళావేదిక ఆధ్వర్యంలో బహుముఖ ప్రజ్ఞానిధి గణపతిరాజు ఈశ్వర వర్మ స్మారక సాహిత్య కార్యక్రమంలో స్థానిక పౌరగ్రంథాలయంలో మంగళవారం జరిగింది. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ' సాహిత్యం, సామాజిక ప్రయోజనం' అంశంపై స్మారకోపన్యాసం చేసారు. ముందుగా గణపతిరాజు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, టీపీఎస్ ఆచార్యులు, దామరాజు విశాలాక్షి, కళావేదిక కార్యదర్శి బుక్కూరు వెంకటరావు, సహ కార్యదర్శి రఘువీర్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'తో క్రీడాకారులకు ఉజ్వల భవిత

- ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో క్రీడా పోటీలు ప్రారంభం



ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

ఏయూ క్యాంపస్: క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసమే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేశారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం క్రీడా రంగంలో మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం రాష్ట్రంలో పండుగలా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారికి సర్టిఫికెట్లు, పతకాలు అందిస్తామని చెప్పారు.

నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయని, వీటిలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. విద్య, ఉపాధి కల్పన, మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ప్రతిభే ప్రామాణికంగా రాష్ట్రంలో 1.36 లక్షల సచివాలయ ఉద్యోగాలను రికార్డు సమయంలో నియామకం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం క్రికెట్, కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి, వివిధ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ వార్డుల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, క్రీడాకారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు



కబడ్డీలో పోటీ పడుతున్న మహిళా క్రీడాకారులు



సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

సునామీ బాలుడికి 19 ఏళ్లు



పవన్ గురునాథ్

మద్దిలపాలెం: సునామీ.. ఈ పేరు వింటేనే వెన్నులో వణుకు పుడుతుంది. ఆ ప్రస్తావన తీసుకురావడానికి కూడా ఎవరూ సాహసించరు. కానీ మన సునామీ బాలుడిని ఆ మత్స్యకార గ్రామం అక్కున చేర్చుకుంది. ప్రపంచాన్ని వణికించిన సునామీ ముప్పును తప్పించి మత్స్యకార గ్రామానికి ముద్దు బిడ్డగా భాసిల్లుతున్నాడు. అతడే ఒలిశెట్టి పవన్ గురునాథ్. ఈయనకు మంగళవారం నాటికి 19 ఏళ్లువచ్చాయి. వివరాలిలా ఉన్నాయి. 19 ఏళ్ల క్రితం మత్స్యకార గ్రామం పెదజాలరిపేటలో ఒలిశెట్టి గురునాథ్, సత్య దంపతులకు పవన్ జన్మించాడు. సునామీ ముప్పు పొంచి ఉందంటూ గ్రామాన్ని ఖాళీ చేస్తున్న క్రమంలో సత్య పురిటినొప్పులతో ప్రసవ వేదన పడుతూ ఇంట్లో ఉంది. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లలేని పరిస్థితి. మరో వైపు ప్రభుత్వ అధికారులు గ్రామాన్ని విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మైక్‌లో హోరెత్తిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఖాళీ చేయిస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో సత్య బాలుడికి జన్మనిచ్చింది. ఆ తరువాత అధికారులు సునామీ ముప్పు విశాఖకు తప్పిందని ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అప్పటి నుంచి పవన్‌ను సునామీ బాలుడు అంటూ పిలుస్తున్నారు. ప్రతి ఒక్కరూ ముద్దు చేస్తున్నారు. ఇప్పుడీ సునామీ బాలుడు పవన్ బీటెక్ చదువుతున్నాడు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం



మొక్కలు పంచుతున్న జేవీ రత్నం

కొమ్మాది: ప్రకృతి ఆధారంగా పంటలు పండించి ఆరోగ్యకరంగా జీవించుదామని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్‌నగర్‌లో మంగళవారం జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం ఎకో వైజాగ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టమాటో, గుత్తి వంగ, పచ్చిమిర్చి పంటల నారు, బంతి నారు పంపిణీ చేశారు. ఇంటిపైన, ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా కూరగాయ తోటలు పెంచాలని కోరారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన
- జనవరి 5న తుది జాబితా ప్రకటన
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: ఓటరు జాబితాలను పారదర్శకంగా సిద్ధం చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు. నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండల అధికారులతో గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ పురోగతిపై మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా నియోజకవర్గంలో ఓటరు జాబితాల తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. కొత్తగా ఓటు హక్కు కోసం, అదేవిధంగా ఇతర ప్రాంతాల నుంచి పేరు మార్పు కోసం డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన ప్రతీ దరఖాస్తును బీఎల్‌వో స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. బీఎల్‌వోలు చేసిన సర్వేపై మండల స్థాయి అధికారులు తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై అన్ని రకాల వివరాలను రాజకీయ పార్టీలకు ఇస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, కలెక్టర్ సూచనలకు అనుగుణంగా నియోజకవర్గంలో ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, క్షేత్ర స్థాయిలో నిశిత పరిశీలన చేస్తామన్నారు. 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలియజేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

బలరాముని అలంకరణలో అప్పన్న



బలరామాలంకారంలో అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి బలరాముని అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బలరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్ఠింపజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకిలో వేంజేంపచేసి, సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

అదిరిన ఆహ్వాన్ ఫెస్ట్



నృత్యం చేస్తున్న విద్యార్థులు



సందడి చేసిన సినీ నటి అవికాగోర్

డాబాగార్డెన్స్: విద్యార్థుల కేరింతలతో ఏవీఎన్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'ఆహ్వాన్ ఫెస్ట్' మంగళవారం ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించగా.. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీతార అవికాగోర్, నటులు బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. చదువుకుంటేనే భవిష్యత్ అంటూ హితవు పలికారు. ఫెస్ట్‌లో భాగంగా డ్యాన్స్, మ్యాజిక్, సింగింగ్, స్కిట్, స్టాండప్ కామెడీ, డైలాగ్ వార్స్, ర్యాంప్ వాక్‌తో విద్యార్థులు అదరగొట్టారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ ఆదీప్ భానోజీరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు అందుకున్నారని.. అందుకు ఎంతో గర్విస్తున్నానన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ వివిధ కళాశాలల విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

29న జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సంబరాలు

సీతంపేట: జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ (జేకాం) వార్షిక సంబరాలను ఈ నెల 29న సాగర్ నగర్‌లోని ఆరిఫ్ సీసైడ్ రిసార్ట్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్టు 2.0 టేబుల్ కోచ్ ఎస్.రాజశేఖర్ తెలిపారు. శాంతిపురంలోని హౌస్‌లో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏన్యువల్ డిలైట్ పేరుతో జరిగే ఈ సంబరాలు దేశంలో అతిపెద్ద ఈవెంట్‌గా నిలుస్తుందన్నారు. ఈ గ్రూప్‌లో సభ్యులుగా ఉన్న వివిధ రంగాలకు చెందిన వ్యాపార, వాణిజ్య వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జేకామ్ చైర్మన్ బి.చైతన్యరాజీవ్ మాట్లాడుతూ ఈఏడాది జేకాం విశాఖ 2.0 గ్రూపు లక్ష్యం అధిగమించి పురోగతి సాధించిందన్నారు. గ్రూప్ సాధించిన ఘన విజయాల నివేదిక ఆరోజు సమర్పిస్తామన్నారు. 2.0 టేబుల్ అభివృద్ధికి పాటు పడిన సభ్యులకు అవార్డులు అందజేస్తామన్నారు.

ఘనంగా దత్త జయంతి



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయుడు

సీతంపేట: శ్రీలలితాపీఠంలో మంగళవారం దత్తాత్రేయ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠంలో గల దత్తాత్రేయునికి విశేష క్షీరాభిషేకం, అర్చన జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. పలువురు భక్తులు పాల్గొని దత్తాత్రేయునికి అభిషేకం, పూజలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణశేష్ ఏర్పాటు పర్యవేక్షించారు.

జూలో రయ్.. రయ్..

- అందుబాటులో బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు
- వృద్ధులు, చిన్నారులకు ఉపయోగకరం



జూ లోపల సైకిళ్లు తొక్కుతున్న విద్యార్థినులు



జూలో వన్యప్రాణులను చూడడానికి బ్యాటరీ వాహనంలో వెళ్తున్న సందర్శకులు

ఆరిలోవ: జూ పార్కులో సందర్శకులు సరదాగా తిరుగుతూ వన్యప్రాణులను చూడవచ్చు. వృద్ధులు, పిల్లలతో వెళ్లేవారు ఇబ్బందిపడాల్సిన అవసరం లేదు. జూ పెద్దది కావడంతో నడుచుకుంటూ తిరగలేని వారికి అందుబాటులో బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు ఉన్నాయి. యువతీ యువకులు సరదాగా ఎంజాయ్ చేస్తూ వీటిపై ఎంచక్కా జూలో చక్కర్లు కొట్టొచ్చు. జూ పార్కు చాలా విశాలమైంది. లోపల మూడున్నర కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లకు ఇరువైపులా వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు సుమారు 70కి పైగా ఉన్నాయి. వాటిలో వివిధ జంతువులు, రకరకాల పక్షులు కొలువుదీరి అలరిస్తున్నాయి. జూ పార్కు మొత్తం నడుచుకుంటూ మూడు కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా ఉన్న వన్యప్రాణులను తిలకించాలంటే చాలా కష్టం. యువకులు, విద్యార్థులు మాత్రం ఉత్సాహంగా నడుచుకుంటూ వెళ్లిపోవచ్చు. కానీ వృద్ధులు, చిన్నారు మాత్రం అంత దూరం నడిచి తిరగలేరు. అలాంటి వారి కోసం ఇక్కడ ప్రత్యేక సౌకర్యాలున్నాయి. బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. బాట్యరీ వాహనంలో 10 మంది వరకు కూర్చొని తిరుగుతూ వన్యప్రాణులను చూడవచ్చు. దీంతో పాటు ఇక్కడ సైకిళ్లు అద్దెకు ఇస్తున్నారు. సైకిల్‌కు గంటకు రూ.50 అద్దె చెల్లించాలి. ఇక్కడ 30 సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఎక్కువగా సైకిళ్లపై తిరుగుతూ వన్యప్రాణులను చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. బ్యాటరీ వాహనాలు 20 వరకు ఉన్నాయి. వీటిలో ప్రయాణించడానికి పెద్దలకు రూ.70, 12 ఏళ్లలోపు పిల్లలకు రూ.50 రుసుం చెల్లించాలి. ఈ వాహనంలో ఒక గంటలో జూలో వన్యప్రాణులు అన్నింటిని చూసి తిరిగి రావచ్చు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు


- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- ఉత్సాహంగా 12వ వార్డులో 'గడప గడపకు పాదయాత్ర'



క్రాంతినగర్లో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో వైఎస్సార్‌సీపీ గడపగడపకు పాదయాత్ర మంగళవారం ఉత్సాహంగా సాగింది. విశాఖ ఎంపీ, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, నాయకులతో కలసి గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. టీఐసీ పాయింట్, క్రాంతినగర్, విద్యానగర్, లీలాసుందరినగర్, జ్యోతినగర్, సుందరయ్య కాలనీల్లో రెండో రోజు పర్యటించారు. ఎంపీ ఆయా కాలనీల్లోని ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, అల్లంపల్లి రాజబాబు, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, బోని శివరామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, హుస్సేన్, వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆకర్షణీయం



ఆకర్షణీయంగా పార్కులోని బుద్ధుడి విగ్రహం, స్థూపాలు

- మిరుమిట్లుగొలుపుతున్న లుంబినీ పార్కు
- పార్కులో ఫొటో షూట్‌లకు పలువురు ఆసక్తి



ఆహ్లాదాన్ని పంచుతున్న పూల వనాలు



సందర్శకులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన మండపం

ఎంవీపీ కాలనీ: అప్పుఘర్‌లోని లుంబినీ పార్కు ఆధునిక అందాలతో సందర్శకులను ఆకట్టుకుంటోంది. అటు ఆధునీకీకరణ, ఇటు సహజత్వం ఉట్టిపడే అందాలతో ఆహ్లాదం పంచుతోంది. పూర్తి గ్రానైట్ వర్కు, వినూత్న సౌకర్యాలతో ఈ పార్కును నగరంలోనే మోడల్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దింది. మూడెకరాల విస్తీర్ణంలో రూ.2.61 కోట్లతో పార్కును అభివృద్ధి చేశారు. బుద్ధుడి విగ్రహం సర్కిల్, ఓపెన్ జిమ్, గ్రానైట్ వర్క్, చిల్డ్రన్ ప్లే ఏరియా, సింహాలతో కూడిన స్థూపాలతో పాటు ఫౌంటేన్, వాకింగ్ ట్రాక్, రిటైనింగ్ వాల్, క్యాంటీన్, ట్రాన్స్ గేట్, లాంగ్ స్కేపింగ్, క్రీడా ప్రాంగణాలను పార్కులో అభివృద్ధి చేశారు. రూ.16 లక్షలతో వినూత్న రకాల పూల, ఆహ్లాదకర మొక్కలతో సుందరీకరించారు. జీవీఎంసీ, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్లు సంయుక్తంగా ఈ పార్కు ఆధునికీకరణను 2017లోనే చేపట్టినప్పటికీ 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేసింది. 2021లో పార్కును పూర్తిస్థాయిలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పార్కులోని బుద్ధుడి విగ్రహంతో కూడిని ముఖద్వారం కనువిందు చేస్తోంది. పలు రకాల పూల మొక్కలను ఆహ్లాదకరమై డిజైన్లుగా ఇక్కడ అలంకరించడంతో పార్కు అందాన్ని అవి రెట్టింపుచేశాయి. దీంతో వెడ్డింగ్, బర్త్‌డే ఫొటోషూట్‌ల కోసం పెద్ద ఎత్తున నగరవాసులు ఈ పార్కుకు తరలివస్తున్నారు.



పార్కులోని చిల్డ్రన్ ప్లే ఏరియా

సుందరంగా థీమ్ పార్కుల అభివృద్ధి



యోగా థీమ్ పార్కు పరిశీలిస్తున్న నగర కమిషనర్ సాయికాంత్ వర్మ

పీఎం పాలెం : ఆధునిక సమాజానికి అనుగుణంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా థీమ్ పార్కులు తీర్చిదిద్దుతున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ 6, 8 వార్డుల పరిధిలో నిర్మాణంలో ఉన్న థీమ్ పార్కులను మంగళవారం ఆయన పరిశీలించారు. పీఎం పాలెం షిప్ యార్డు లే అవుట్‌లో నిర్మిస్తున్న యోగా థీమ్ పార్కును, బక్కన్నపాలెం బుచ్చిరాజు లే అవుట్‌లోని స్పోర్ట్స్ థీమ్ పార్కును, ఎమ్మెస్సార్ లే అవుట్‌లోని ల్యాండ్ స్కేప్ థీమ్ పార్కును, వైఎల్‌పీ లే అవుట్ ఫామ్ గార్డెన్ పార్కును పరిశీలించారు. యోగా థీమ్ పార్కును పచ్చని మొక్కలతో నింపాలని, స్పోర్ట్స్ థీమ్ పార్కులో వాలీబాల్, షటిల్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ఏరియాలో గ్రీనరీ కోసం ఆకర్షణీయమైన మొక్కలు 15 రోజుల్లో నాటాలని ఆదేశించారు. అనంతరం కొమ్మాది జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. లా కాలేజీ జంక్షన్ ప్రమాదకరంగా ఉన్నందున వీ కన్వెన్షన్ ఎదురుగా స్థలం సూచిస్తూ జంక్షన్ తరలించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జెడ్సీ కనక మహాలక్ష్మిని ఆదేశించారు.